
సాక్షి
పల్నాడు
గురువారం । 25 । జనవరి । 2024



యార్డుకు 1,16,066 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 1,16,066 మిర్చి బస్తాలు రాగా, ఈ–నామ్ విధానం ద్వారా 1,13,746 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 824.10 అడుగుల వద్ద ఉంది.



విశ్వేశ్వరస్వామి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట గౌరీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం పురస్కరించుకొని బుధవారం కల్యాణం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నరసరావుపేట టౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. ఆశీర్వాదం పాల్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జైలు అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలు మండల న్యాయ సహాయక కేంద్రాన్ని ఆశ్రయిస్తే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. మొదట సబ్‌జైలులో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర స్వామిని ఆదేశించారు.

అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదు సీజ్

రూ.14.50 లక్షలు స్వాధీనం

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని గంటావారిపాలెం గ్రామం జాతీయ రహదారి మార్గంలో వ్యవసాయ చెక్ పోస్టు వద్ద ఆధారాలు లేకుండా తీసుకొని వెళుతున్న రూ. 14.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి.తిరుపతిరావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన తనిఖీల్లో భాగంగా ప్రకాశం జిల్లా దోర్నాలకు చెందిన వల్లూరి ఏడుకొండలు ఏలాంటి ఆధారాలు లేకుండా తన వాహనంలో నగదు తీసుకుని వెళుతుండడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేస్తామన్నారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించామన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



ఫిరంగిపురం: బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి అన్నారు. దీనాపూర్ క్యాంపస్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం రూరల్ క్రిస్టియన్ కళాశాల, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు సేకరించారు. జాతీయ బాలిక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి, సీడీపీవో పి.ప్రసూన, గుంటూరు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జీఏ ప్రమీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో 62 మంది ఎస్ఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 62 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో 19, పల్నాడు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 6, ప్రకాశం జిల్లాలో 12, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలో 13, తిరుపతి జిల్లాలో ఐదుగుర్ని బదిలీ చేశారు.

శ్రమైక ధన సౌందర్యం

వడియ రాజుల ఉన్నతికి ప్రభుత్వం చర్యలు

- నాడు వలస పక్షులు.. నేడు దర్జా బతుకులు
- తెల్లరాయి క్వారీల్లో 700 కుటుంబాలకు ఉపాధి చూపించిన ప్రభుత్వం
- బిడ్డలను చదివించుకుంటూ ఆర్థికంగా బలపడుతున్న వైనం
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వడియరాజుల కుటుంబాలు

చేద్దామంటే పనిలేని పరిస్థితి.. తిందామంటే ముద్దలేని స్థితి.. ఆకలితో అల్లాడుతున్న పిల్లలను చూడలేక పొట్టచేత పట్టుకుని దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. ఈక్రమంలో బిడ్డల చదువులు అధోగతి. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో వడియరాజుల సామాజిక వర్గీయుల పరిస్థితి. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారి స్థితిగతులు మారాయి. నేడు చేతినిండా పని.. సమృద్ధియైన ఆహారం.. ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉండి తమ పిల్లలను చదివించుకుంటూ ఆనందంగా ఉంటున్నారు.



క్వారీలో పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

దాచేపల్లి: గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి దొరక్క వలస పక్షులుగా ఉన్న వడియరాజులు.. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తెల్లరాయి క్వారీల్లో ఉపాధి పొందుతూ రాజుల్లా బతికేస్తున్నారు. వడియరాజులు.. గురజాల నియోజకవర్గం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దాచేపల్లి, నడికుడి, నారాయణపురం, కేసానుపల్లి, గామాలపాడు గ్రామాల్లోని తెల్లరాయి క్వారీల్లో 700 కుటుంబాలకు పైగా ఈ సామాజిక వర్గీయులు ఉపాధి పొందుతున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వలసలకు చెక్ పడడంతో స్థానికంగానే ఉపాధి పొందుతూ ప్రశాంతమైన జీవితం గడుపుతున్నారు.

వలసలు నిల్.. ఉపాధి ఫుల్..

దాచేపల్లితో పాటుగా పలు గ్రామాల్లో ప్రభుత్వ అనుమతితో తెల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నారు. వడియరాజుల కుటుంబాలవారు ఎక్కువగా ఈ క్వారీల్లో పనులు చేస్తుంటారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ తెల్లరాయి క్వారీల్లో స్థానికంగా నివశించే వడియరాజులకు ఉపాధి లభించలేదు. పూట గడవటమే కష్టంగా ఉండటంతో కన్నబిడ్డలను బంధువుల వద్ద వదిలేసి అధిక సంఖ్యలో వడియరాజుల కుటుంబాలు ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నైలకు వలస వెళ్లారు. తల్లిదండ్రులు ఉపాధి కోసం వలస వెళ్లటంతో బిడ్డల చదువులు కూడా ఆగిపోయాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వడియరాజులు సొంత ఊరికి దూరంగానే బతికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రభుత్వం నుంచి తెల్లరాయి క్వారీలకు లీజులు ఇప్పించారు. మండల పరిధిలో ఉన్న ఈ క్వారీల్లో ప్రస్తుతం 700 వడియరాజుల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. క్వారీల్లో రాయి కొట్టటం, ట్రాక్టర్లు, ట్రిప్పర్లలో లోడింగ్, ట్రాక్టర్లు, ట్రిప్పర్ల డ్రైవర్లుగా ఎక్కువశాతం వీరు పనిచేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు క్వారీల్లో పనిచేసి కూలి డబ్బులు తీసుకుంటున్నారు. రోజుకు సగటున ఒక్కో వ్యక్తికి రూ.600 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తుంది. ఉపాధి దొరుకుతుండడంతో పిల్లలను స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తూ చదివిస్తున్నారు.

అప్పట్లో పనిలేక బెంగళూరు వెళ్లాం..



గత టీడీపీ ప్రభుత్వంలో క్వారీల్లో ఉపాధి లేక బెంగళూరు వలస వెళ్లాం. అక్కడ కూలి పనులు చేసుకుని జీవితాలు గడిపాం. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థానిక క్వారీల్లో ఉపాధి చూపించింది. ఇప్పుడు ఇక్కడే పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నాం.

– బత్తుల రాజు, స్థానికుడు

365 రోజులు పని దొరుకుతుంది



గత ఐదేళ్లుగా ఇక్కడ క్వారీల్లో పనిచేస్తున్నాం. వర్షం పడిన రోజు తప్ప మిగతా రోజులన్నీ పని ఉంటుంది. రోజుకి రూ.600కు పైగానే కూలి లభిస్తుంది. ఈ ప్రభుత్వంలో ఉపాధి కోసం వలసలు వెళ్లడం అనేదే లేదు. మాకు 365 రోజులు పని దొరకటం సంతోషంగా ఉంది.

– వల్లెపు మరియమ్మ, స్థానికురాలు

సంతోషంగా బతుకుతున్నాం



తెల్లరాయి క్వారీల్లో పనిచేసుకుని ప్రశాంతంగా బతుకుతున్నాం. గతంలో నేను ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాను. ఇప్పుడు డ్రైవింగ్ మానుకొని క్వారీల్లో పని చేస్తున్నాను. వారం వారం కూలి డబ్బులు తీసుకుంటున్నాం. ఉపాధికి ఢోకా లేకుండా ఉంది. ఒంట్లో ఓపిక ఉన్నంత వరకు పని చేసుకోవచ్చు.

– షేక్ హస్సన్ అహ్మద్, స్థానికుడు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, చిత్రంలో జేసీ ఎ.శ్యాంప్రసాద్, అధికారులు

బాలికాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్
- నరసరావుపేటలో ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నరసరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తూ ప్రభుత్వం విద్యను అందిస్తోందని, ఈ అవకాశాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం భువనచంద్ర టౌన్‌హాలులో జిల్లా మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ, బాల సంరక్షణ విభాగం, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, డీఆర్‌డీఏ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా వ్యవహరించే వారి గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులకు చదువుతో పాటు ఆడపిల్లల భద్రత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని తెలిపారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, భద్రంగా ఉండటానికి తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. బంగారు తల్లి పథకానికి సంబంధించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, బాలల సంరక్షణ డీపీసీఓ విజయ్ కుమార్‌లు బాలల హక్కులు, చట్టాలు, చైల్డ్ మ్యారేజ్ గురించి వివరించారు. జిల్లా నలుమూలల స్కూళ్ల నుంచి 8,9,10 చదువుతున్న బాలికలు పెద్దఎత్తున తరలివచ్చారు. పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. బాలికల సంక్షేమం, జాతీయ బాలికల దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఐసీడీఎస్ టీచర్లు, సూపర్‌వైజర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలపై డయల్ యువర్ కలెక్టర్‌కు 12 సమస్యలు

నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్‌కు ప్రజల నుంచి 12 సమస్యలు వచ్చాయి. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డీఆర్‌ఓ కె.వినాయకంతో కలిసి ఉదయం 11 గంటల నుంచి 12 వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో వివిధ ప్రాంతాల నుంచి 12 మంది ఫోన్‌చేసి వారి సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అందులో ఎనిమిది మంది ఓటర్ల తొలగింపు, ఒకరు డబుల్ ఎంట్రీలు, మరొకరు ఓటరుగా చేర్పు గురించి, మరో ఇద్దరు ఎన్నికలయేతర సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ, బీజేపీ, టీడీపీ, వామపక్షాలు, ఇతర పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవశ్యం

- డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు
- ఓటు విలువపై జిల్లాస్థాయి పోటీలు



జిల్లాస్థాయి పోటీల విజేతలతో డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన కలిగిఉండాలని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం, ఓటు విలువపై అవగాహన పెరిగేలా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ అంశాలలో పోటీలు నిర్వహించారు. జిల్లా పరిధిలోని నియోజకవర్గాల స్థాయిలో విజేతలకు జిల్లాస్థాయిలో ఈపోటీలు జరిగాయి. జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎం.శివశంకర్, ఎస్.రమేష్, షేక్ ఆయేషా సుల్తానా, ఎం.రంగయ్య, గురుబాబు, బాజీబాబు, కోటేశ్వరి, షేక్ ఫాతిమా వ్యవహరించారు. హెచ్‌ఎం టి.రవికాంత్ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

క్విజ్ పోటీల్లో ఎస్.దీపిక, యు.పూజిత, ఎ.శరణ్య (జడ్పీహెచ్ఎస్, కోటప్పకొండ), షేక్ షాహిదాబేగం, పి.మహేశ్వరి, ఎన్.హారిక (గణపవరం), వ్యాసరచనలో కె.నాగరోషిణి (వేల్పూరు), ఎస్.లీలావినయ్‌కుమార్ (ఏపీఎంఎస్, గురజాల), వక్తృత్వంలో టి.అమృతరాణి (75 త్యాళ్లూరు), షేక్ షాహీన్ (జడ్పీ బాలికల పాఠశాల, మాచర్ల), చిత్రలేఖనంలో ఎం.శ్యామ్ కుమార్ (ఉప్పలపాడు), జె.హర్షిత (జడ్పీ బాలికల పాఠశాల, మాచర్ల)లు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఈనెల 25వతేదీ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

చిత్తడి నేలల సంరక్షణ సమష్టి బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్తడి నేలల సంరక్షణ సమష్టి బాధ్యతని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులోని వలస పక్షుల సంరక్షణ కేంద్రం వద్ద బుధవారం చిత్తడి నేలల సంరక్షణ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కంతేరు, ఉప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిత్తడి నేలల సంరక్షణపై చక్కటి చిత్రాల్ని గీశారు. డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బాగుల్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని సూచించారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, పక్షుల సంరక్షణ కేంద్రం చైర్మన్ అనిల్, ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ డీఓ శివకుమార్, ఉపాధ్యాయులు అప్పారావు, శివశంకర్, దానయ్య, గంగాధర్, శాంతిప్రియ, బాబూరావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో 31లోపు నమోదు చేసుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ఈనెల 31వ తేదీ తుది గడువు అని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం తెలిపారు. ఈమేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆమె చెప్పారు. గడువు ముగిసిన తరువాత ఎటువంటి పొడిగింపు ఉండదని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి పేరు, పుట్టినతేదీ, తండ్రిపేరు, మెరిట్‌కార్డు, ఆధార్ కార్డుపై ముద్రించిన విధంగానే ఏ ఒక్క అక్షరం తేడా లేకుండా ఉండాలని తెలిపారు. ఆధార్ వివరాలు సరిపోలని పక్షంలో వివరాలు సరైనవి కావనే సమాచారం వస్తుందని, ఈ విధంగా వచ్చినవారు డీఈఓ కార్యాలయంలో ఈనెల 27లోపు ఆధార్ మిస్‌మ్యాచ్ వివరాలను సమర్పించాలని సూచించారు. విద్యార్థి సమర్పించిన దరఖాస్తును సంబంధిత స్కూల్ నోడల్ అధికారిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, ఫిబ్రవరి 15లోపు సబ్‌మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా నవంబర్ 2019, ఫిబ్రవరి 2021, మార్చి 2022 సంవత్సరాల్లో ఎంపికై, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విధిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ‘ఆడుదాం ఆంధ్రా’

- జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- ఉత్సాహంగా నియోజకవర్గస్థాయి పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట రూరల్: గ్రామీణ యువకుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు బుధవారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీలను జేసీ శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడలపై ఆసక్తి కలిగించేలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించి వారిని ప్రతిభావంతులుగా చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ప్రతిభ ఉన్న యువకులు పాల్గొనేందుకు ఆడుదాం ఆంధ్రా చక్కని వేదిక అని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. నరసరావుపేట అర్బన్, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల మండలాల స్థాయిలో విజయం సాధించిన జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఆడుదాం ఆంధ్రా ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ యు.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కేవీ శివప్రసాద్, పోటీల నియోజకవర్గ కన్వీనర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

గుంటూరులో బాలికా దినోత్సవ ర్యాలీ

గుంటూరు మెడికల్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక నగరంపాలెం స్టాల్ గరల్స్ హైస్కూల్ బాలికలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ అవకాశం ఇస్తే ఆడపిల్లలు ఏ స్థాయికైనా ఎదుగుతారని చెప్పారు. ఆడపిల్లలు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి గురువారం ఐరన్ మాత్రలు తప్పకుండా మింగాలని, అవసరం అయితే స్కూల్ లోనే మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఐఓ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఉరకలెత్తిన ఉత్సాహం

- హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు
- క్రీడల అంబాసిడర్లుగా ప్రముఖ క్రీడాకారులు వంశీకృష్ణ, వీరాంజనేయులు



క్రీడల అంబాసిడర్స్‌తో గెలుపొందిన క్రీడాకారులు

సత్తెనపల్లి: భవిష్యత్ క్రీడాకారులను తయారు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని 34 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 7,750 మంది రిజిస్ట్రేషన్ చేసుకొని క్రీడల్లో ఉల్లాసంగా పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోటీలు సత్తెనపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామ/ వార్డు సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజయవంతంగా ముగిశాయి. క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు కార్యక్రమంపై ఆసక్తి కనబరిచారు. నాలుగు దశల్లో జరిగే ఈ క్రీడల్లో ప్రస్తుతం నియోజకవర్గ స్థాయి పోటీలను బుధవారం నుంచి ఈ నెల 29 వరకు సత్తెనపల్లి వేదికగా నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు దివంగత వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, మండల ప్రత్యేక అధికారి ఏ సుధాకర్‌రావు, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ ఏఓ బసవకుమారి, ఆడుదాం ఆంధ్రా మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానం సత్తెనపల్లి, ద్వితీయ స్థానం నకరికల్లు, తృతీయ స్థానం ముప్పాళ్ల కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో ప్రథమ స్థానం సత్తెనపల్లి రూరల్, ద్వితీయ స్థానం నకరికల్లు, తృతీయ స్థానం ముప్పాళ్ల కైవసం చేసుకున్నాయి.

ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. 20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్రీడల అంబాసిడర్స్ పసుపులేటి వంశీకృష్ణ, ఎస్.వీరాంజనేయులును సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పీడీలు, నోడల్ అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు



ఫ్రాన్స్ అంబాసిడర్ మెర్రిన్ రైఖాన్‌ను సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ఫ్రాన్స్‌లో భారతీయ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలున్నాయని ఫ్రాన్స్ అంబాసిడర్ మెర్రిన్ రైఖాన్ తెలిపారు. ఆయన బుధవారం నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ఫ్రాన్స్‌లో భారతీయ విద్యార్థులకు ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంటు కోర్సులలో చదువుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తున్నామని తెలిపారు. అనంతరం వీసీ ఆచార్య పి. రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎన్‌యూ, ఫ్రాన్స్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఫ్రాన్స్‌తో ఏఎన్‌యూ ఎంఓయూ కుదుర్చుకునే అంశాలపై ప్రాథమిక చర్చలు జరిగారు. దీని ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు రెండు దేశాల విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడం, పరిశోధనలు చేసుకునే అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. భారతీయ విద్యార్థులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లకు ఉన్నత విద్యకు వెళుతున్న సందర్భంలో ఫ్రాన్స్‌లో ఉన్న అవకాశాలను రైఖాన్ వివరించారు. ఏఎన్‌యూ ఆన్‌లైన్ విధానంలో బోధిస్తున్న ఫ్రెంచ్ భాషను విద్యార్థులు నేర్చుకుని అవగాహన పెంచుకోవాలని రైఖాన్ సూచించారు. రాబోయే రోజుల్లో భారత్‌కు ఫ్రాన్స్ విద్యా ,పరిశోధన అంశాలలో మంచి భాగస్వామిగా నిలుస్తుందని ఆమె తెలిపారు. చర్చల్లో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి పాల్గొన్నారు. ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాలతో ఏఎన్‌యూ ఎంఓయూ కుదుర్చుకునే అంశాలను అధ్యయనం చేయాలని యూనివర్సిటీ అధికారులకు వీసీ సూచించారు.

రాజ శ్యామల యాగానికి అంబటి మురళీకృష్ణకు ప్రత్యేక ఆహ్వానం



అంబటి మురళీకృష్ణకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

కొరిటిపాడు(గుంటూరు): విశాఖ శారదా పీఠంలో ఫిబ్రవరి 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న 'రాజ శ్యామల యాగం'కు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణకు విశాఖ శారదా పీఠం పీఠాధిపతి ఉత్తరాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. విజయవాడలోని ఓ గెస్ట్ హౌస్‌లో స్వామి వారిని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కలసి ఏడాదిగా 'జగన్నామ సంక్షేమ సంగమం' కార్యక్రమాల పరంపరను, చేపట్టిన 85 కార్యక్రమాల వివరాలను అందించారు. మానవ సేవే మాధవ సేవ అనే విధంగా రూపుదిద్దుకున్న ఈ 85 సంక్షేమ సంగమం కార్యక్రమాలను మహా స్వామి వారు ప్రశంసించడమే కాకుండా రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమంలో తాను వ్యక్తిగతంగా పాల్గొని ఆశీర్వచనాలు అందిస్తానని చెప్పినట్లు మురళీకృష్ణ చెప్పారు. బజరంగ్ ఫౌండేషన్ నిర్వహణపై ముగ్ధులైన స్వామి వారు అంబటి మురళీకృష్ణను పుణ్యవస్త్రంతో దీవించి ఆశీర్వచనాలు అందజేశారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలకు యజ్ఞశ్రీ ఎంపిక



యజ్ఞశ్రీని సత్కరిస్తున్న కలెక్టర్

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కిష్టం యజ్ఞశ్రీ స్కూల్ గేమ్స్ జిమ్నాస్టిక్స్‌లో నేషనల్ ప్లేయర్‌గా ఎంపికైనందుకు జిల్లా కలెక్టర్ శివశంకర్ సత్కరించి, బహుమతిని అందించారు. బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీయస్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని టౌన్ హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో యజ్ఞశ్రీని అభినందించారు. ఆమె ప్రస్తుతం గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్
- రిపబ్లిక్ డే సందర్భంగా విజ్ఞాన్‌లో రక్తదాన శిబిరాలు



రక్తదాన శిబిరంలో విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

చేబ్రోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, గుంటూరు జీజీహెచ్, సీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఒకచోట ఎవరికో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందన్నారు. ప్రమాదాల సమయంలో బాధితులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. రక్తదానం వల్ల నేడు ఎంతో మందిని వైద్యులు బతికించగలుగుతున్నారని వెల్లడించారు. 500 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎస్సీల శ్మశానవాటిక పరిరక్షణకు కృషి

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్
- చింతలపూడి శ్మశానవాటిక పరిశీలన
- న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ



శ్మశానాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తాడేపల్లి రూరల్ : చింతలపూడిలో ఎస్సీల శ్మశానవాటిక పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుముడి విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం దుగ్గిరాల మండలలోని చింతలపూడిలో బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారన్నారు. ఇందులో భాగంగా గ్రామానికి వచ్చి వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ మల్లేశ్వరి మాట్లాడుతూ శ్మశానవాటిక పరిరక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే పంటలను తరలించేందుకు ఇబ్బంది పడతామంటూ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి షెడ్యూల్ కులాల వారికి జనాభా ప్రాతిపదికన అర ఎకరం నుంచి ఎకరం వరకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ మేరకు చింతలపూడిలోని ఎస్సీలకు అర ఎకరం కేటాయించాలని సూచించారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ఇరు వర్గాల నుంచి ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి, ఎవరికీ నష్టం జరగకుండా సమస్యను పరిష్కరించాలని తెనాలి సబ్ కలెక్టర్‌కు సూచించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ జాన్, వీఆర్వోలు నితీష్ కుమార్, సురేష్, లక్ష్మి మంజు, సర్వేయర్లు గోపాలరావు, శ్రీనివాసరావు, మధు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 23వ తేదీ లోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కారెంపూడి గురుకులం ప్రిన్సిపాల్ వనపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు కూడా దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారని, మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. అదే రోజు సాయంత్రం 2 గంటల నుంచి 4.30 వరకు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దగ్గర్లో ఉన్న గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

రెండు గృహాల్లో చోరీ

నరసరావుపేట రూరల్: పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. మండలంలోని అల్లూరివారిపాలెంలో వరస చోరీలకు పాల్పడ్డారు. చేతివాటం ప్రదర్శించి రెండు గృహాల్లోని దాదాపు రూ.4 లక్షలు, 11 సవర్ల బంగారాన్ని చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని యక్కంటి అంజిరెడ్డి, హైమావతి దంపతులు ఉదయం 9గంటల సమయంలో పశువుల మేత కోసం పొలానికి వెళ్లారు. 11 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి తలుపులు పగులకొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.1.80 లక్షలు, 9 సవర్ల బంగారం కనిపించలేదు. అలాగే గ్రామంలోని షేక్ జాన్‌బీరా ఇంటి తలుపులు పగులకొట్టి బీరువాలోని రూ.2 లక్షలు, రెండు సవర్ల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ జగదీష్, ఎస్ఐలు రోశయ్య, హజరత్తయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సామాజిక పోరాట యోధుడు ఠాకూర్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



వేడుకల్లో పాల్గొన్న డొక్కా మాణిక్యవరప్రసాద్, జంగా కృష్ణమూర్తి

గుంటూరు రూరల్: సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు కర్పూరి ఠాకూర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవర ప్రసాద్ తెలిపారు. బుధవారం అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో బీపీ మండల్ విగ్రహం వద్ద ఏపీ బీపీ మండల్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఠాకూర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ విగ్రహానికి, ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ ఠాకూర్ చేసిన ఉద్యమాలు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఠాకూర్ ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు అడుగులు వేయాలని సూచించారు. బీపీ మండల్ విగ్రహ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బిహార్ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఠాకూర్‌కు భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని అందించాలని నిర్ణయించటం యావత్ జాతి గర్వించదగ్గ విషయమని చెప్పారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానేత ఠాకూర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వీ రామారావు, సీహెచ్ వాసు, శాఖమూరి సాంబశివరావు, నిడుముక్కల రాంబాబు, టి.నరసింహారావు, కె.అంకమ్మరావు, టి.కేశవ, డి.శివకుమార్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కి భారతరత్న అవార్డు ప్రకటించడం బీసీ వర్గాలకే గర్వకారణమని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాడ్జి సెంటర్‌లో భారతరత్న అవార్డు ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు, సామాజిక న్యాయకేంద్ర కన్వీనర్ వై.కోటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెనాలిలో ఉత్సాహంగా 2కే రన్

- ఓటు హక్కుపై అవగాహన కోసం..
- జెండా ఊపి ప్రారంభించిన సబ్‌కలెక్టర్



జెండా ఊపి ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి: 14వ జాతీయ ఓటరు దినోత్సవం పట్టణంలో ఘనంగా జరిగింది. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలనే అవగాహనను కల్పించేందుకు 2కే రన్‌ను నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆరంభమైన 2కే రన్‌ను తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. తాను కూడా రన్‌లో పాల్గొన్నారు. సబ్ కలెక్టర్‌తోపాటు మండల తహసీల్దార్ కె.రవిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు ఉత్సాహంగా పరుగు తీశారు. పెదరావూరు రోడ్డులో కబేళా వంతెన వరకు జరిగిన 2కే రన్‌లో పలువురు స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రం, దేశం భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ ఓటు వేయటం బాధ్యతగా గుర్తెరగాలని సూచించారు. ఓటు హక్కున్న అందరూ ఎన్నికల్లో ఓటు వేయటమే కాకుండా తోటివారిని ఓటు వేసేలా చైతన్యం కలిగించాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవిబాబు, కమిషనర్ జస్వంతరావు చెప్పారు.

గుంటూరు రేంజ్‌లో పలువురు సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరికొందరూ సీఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి.ప్రభాకర్	రేంజ్ వీఆర్, గుంటూరు	తుళ్ళూరు ట్రాఫిక్-2, గుంటూరు జిల్లా
జె.అనురాధ	డీసీఆర్‌బీ-2, గుంటూరు జిల్లా	తుళ్ళూరు-2, గుంటూరు జిల్లా
కె.చంద్రశేఖర్	రేంజ్ వీఆర్, గుంటూరు	డీసీఆర్‌బీ-2, గుంటూరు జిల్లా
షేక్.షఫీఅహ్మద్	రేంజ్ వీఆర్, గుంటూరు	పీసీఆర్, తెనాలి, గుంటూరు జిల్లా
కె.వెంకటేశ్వరరావు	పీసీఆర్, తెనాలి గుంటూరు జిల్లా	పీసీఆర్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
ఎస్.వెంకటరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	డిఎస్‌బీ-1, గుంటూరు
ఎం.ఆనందరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	డీఎస్‌బీ-2, గుంటూరు జిల్లా
ఎండీ.నిస్సార్‌భాషా	సీసీఎస్, గుంటూరు జిల్లా	ప్రత్తిపాడు సర్కిల్, గుంటూరు జిల్లా
మల్లవరపు వెంకటసుబ్బారావు	ప్రత్తిపాడు సర్కిల్, గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
వి.మల్లిఖార్జునరావు	మంగళగిరి టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా	సోషల్ మీడియా/సైబర్ క్రైం సెల్, బాపట్ల జిల్లా
మద్రెడు శ్రీనివాసరావు	డీఎస్‌బీ-2, గుంటూరు జిల్లా	మంగళగిరి టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా